క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ, ఆంజనేయస్వామి దేవాలయాల నిర్మాణానికి ఆదివారం కేశమోని శంకరయ్యగౌడ్ ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.50వేల విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సభ్యులు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భవనాలు నిర్మించాలి

చారకొండ: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు కొత్తగా స్థలాలు కేటయించి, భవనాలు నిర్మించాలని బీజేపీ మండల నాయకుడు కిరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన మండలంగా ఏర్పడి దాదాపుగా 9 సంవత్సరాలు గడిచినా మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాలకు కనీసం స్థలాలు కేటాయించక పోవడం సరికాదన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ చొరవ తీసుకొని మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు తక్షణమే స్థలాలు కేటాయించి, సంబంధిత నిర్మాణాలకు నిధులు మంజూరుకు కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు సన్మానం

వెల్దండ: ఆర్మీలో 22 ఏళ్ల సేవలందించి పదవీ విరమణ పొందిన మండల కేంద్రానికి చెందిన గంగపూరం భీమయ్యను ఆదివారం 10వ తరగతి స్నేహితులు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ విశ్రాంత జీవితాన్ని సామాజిక సేవకు కేటాయిస్తానని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరిక

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరులో గ్రామ అల్యూమినీ కమిటీ ఆధ్వర్యంలో 20 మంది పిల్లలను ఆదివారం ప్రభుత్వ బడిలో చేర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శేఖర్ రెడ్డి, వెంకటస్వామి, బ్రహ్మాచారి, నీలం రెడ్డి, రంగన్న స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని మంతటిలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఫొటో కూడిన కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన కృష్ణ ఫ్లెక్సీని చించివేశాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సలేశ్వర్ ఆదివారం స్థానిక స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

రాష్ట్ర మహాసభకు తరలిరండి

నాగర్‌కర్నూల్ క్రైం: టీజీఎస్ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర మహాసభకు తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వీఎస్ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్య అతిథిగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ హాజరవుతారని తెలిపారు.

చలో రాజ్‌భవన్‌ను విజయవంతం చేయండి



తెలకపల్లి: ఆపరేషన్ కగార్ ఆపాలని ఈ నెల 23న నిర్వహించే చలో రాజ్‌భవన్‌ను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. అదివారం మండల కేంద్రంలో చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి సంబంధించిన ఆయన కరపత్రాన్ని విడుదల చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రవీందర్, పరమేశ్వర్, బాలకృష్ణ, రాములు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

కొల్లాపూర్: పట్టణంలోని బండాయిగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేష్ ముదిరాజ్, రమేష్‌గౌడ్, వేణుగౌడ్, కృష్ణయాదవ్, జయప్రకాష్, వెంకటేష్‌యాదవ్, సత్యం, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.



రోడ్ల నిర్వహణపై శ్రద్ధ ఏది?

- గుంతలమయంగా బీటీ రోడ్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఉప్పునుంతల - కొత్తరాంనగర్ మట్టి రోడ్డు



గుంతలమయంగా మారిన ఉప్పునుంతల- పల్కపల్లి రోడ్డు

ఉప్పునుంతల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పల్లెలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్నేళ్లుగా నిర్వహణలేక రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గ్రామాలను కలుపుతూ ఉన్న అంతర్గత రోడ్లు మరింతగా అధ్వానస్థితికి చేరుకున్నాయి. ఏళ్ల తరబడిగా మరమ్మతుకు నోచుకోని రోడ్లపై ప్రయాణించడం ప్రజలకు నరకయాతనగా మారింది. రోడ్లను బాగుచేయించడంలో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. కొన్నేళ్లుగా మట్టి రోడ్ల అభివృద్ధిపై శ్రద్ధ పెట్టకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షాలకు రోడ్లపై గోతులు ఏర్పడ్డాయి. రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు కమ్ముకొని బండ్ల డొంకలను తలపిస్తున్నాయి. గతంలో మెటల్‌రోడ్లుగా వేసి తర్వాత పట్టించుకోకపోవడంతో కంకర లేసిపోయి రోడ్లపై వెళ్లడం కష్టంగా మారింది.

ముందుకు సాగని పనులు

ఉప్పునుంతల మండల కేంద్రం నుంచి అచ్చంపేట మండల పరిధిలోని పల్కపల్లి గ్రామానికి అనుసంధానంగా ఉన్న దాదాపుగా 5 కిలోమీటర్లు ఉన్న మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు సీఆర్ఆర్ నిధులు రూ. 4.50 కోట్లు మంజూరు కాగా 2024 డిసెంబర్ 1న రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి దనసరి అనుసూయ (సీతక్క) భూమి పూజ చేసి పనులకు శంకుస్థాపన చేశారు. దాదాపుగా ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు అడుగు ముందుకు సాగలేదు. ఉప్పునుంతల మండల కేంద్రం నుంచి రాకొండ వరకు, పోలెపల్లి నుంచి రామగిరి వరకు పనులు మంజూరై ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు.

అధ్వానంగా మట్టి రోడ్లు

మండలంలో గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు మరింతగా అధ్వానంగా తయారయ్యాయి. ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ రోడ్డు, ఉప్పునుంతల నుంచి పెద్దాపూర్, మొల్గర- ఉప్పునుంతల రోడ్ల వెంట కంపచెట్లు కమ్ముకున్నాయి. మర్రిపల్లి నుంచి గట్టుతుమ్మెన్ స్టేజీ వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుపై కంకర తేలి వాహనాలు వెళ్లలేని పరిస్థితి దాపురించింది. అదేవిధంగా మర్రిపల్లి నుంచి లక్ష్మాపూర్ వరకు ఉన్న రోడ్డు వెంట కంకర లేసి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. దాసర్లపల్లి నుంచి పెద్దాపూర్ వరకు, సదగోడు నుంచి తిర్మలాపూర్ వరకు, కొరటికల్ నుంచి చాకలి గుడిసెల వరకు మట్టి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అదేవిధంగా కొరటికల్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వెల్టూరు వరకు ఉన్న లింక్‌రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కాంసానిపల్లి తండా నుంచి రంగంపేట మీదుగా ఉన్న మెటల్ రోడ్డుపై వేసిన కంకర తేలింది.

తూతూమంత్రంగా మరమ్మతు

మండలంలోని బీటీ రోడ్ల వెంట నామమాత్రంగా పనులు చేస్తున్నారు. పనుల నాణ్యతపై అధికారులు ఏమాత్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. ఉప్పునుంతల నుంచి మర్రిపల్లి వరకు గతేడాది స్నర కిందట ఎన్నికల ముందు హడావుడిగా బీటీ రోడ్డును రెన్యూవల్ చేసిన కాంట్రాక్టర్ రోడ్డు అంచుల వెంట మట్టి సరిగా వేయకుండ వదిలేశాడు. అదేవిధంగా కాంసానిపల్లి నుంచి ఉప్పునుంతల మండల కేంద్రం వరకు వేసిన రెండు వరుసల బీటీ రోడ్డు పనులు సక్రమంగా చేయకపోవడంతో రోడ్డు ఎగుడుదిగుడుగా మారి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని తాడూరు-ఉప్పునుంతల, ఈరట్వానిపల్లి నుంచి పెనిమిళ్ల వరకు, పెనిమిళ్ల నుంచి సీబీ తండా వరకు ఉన్న బీటీ రోడ్లు కొన్నేళ్ల కిందట వేసి తిరిగి పట్టించుకోకపోవడంతో గోతులుపడి పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుకు ఇరువైపులా చెట్లపొదలు కమ్ముకున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

మండలంలో ఉన్న పీఆర్ పరిధిలోని బీటీ రోడ్ల రెన్యూవల్, మట్టి రోడ్ల అభివృద్ధికోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం. ఉప్పునుంతల నుంచి పల్కపల్లి వరకు బీటీ రోడ్డు కోసం సీఆర్ఆర్ నిధులు రూ. 4.50 కోట్లు మంజూరు కాగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. పోలెపల్లి నుంచి మామిళ్లపల్లి మార్గంలో నాలుగు కిలోమీటర్లు బీటీ రోడ్డు రెన్యూవల్ పనులు తీసుకున్న కాంట్రాక్టర్‌కు పనులు చేయకపోవడంతో నోటీసులు ఇచ్చాం. ఇంతకు ముందు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రావడంలేదని రోడ్డు పనులు చేయడం లేదు.

– మహేష్, పీఆర్ ఏఈఈ, ఉప్పునుంతల

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

చారకొండ: మండలంలోని జూపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాడారి వీరయ్య, అర్కంటి బోందయ్య కుటుంబాలను వెల్దండ మండల సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు ఆదివారం బాధిత నివాసాలకు వెళ్లి పరామర్శించారు. వీరయ్య కుటుంబానికి కుటుంబానికి రూ.10 వేలు, బోందయ్య కుటుంబానికి రూ.5వేలతోపాటు 25 కేజీల బియ్యం బ్యాగులను అందజేశారు. అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు అంకిల్ల మైసమ్మ ఇల్లు కూలిపోవడంతో రూ.5 వేల సాయంతోపాటు 25 కేజీల బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ సాయి కుమార్, యువకులు సిరాజ్, రియాజ్, ప్రశాంత్, రామస్వామి, కృష్ణ తదితరులు ఉన్నారు.



బియ్యం అందిస్తున్న భాస్కర్ రావు

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని వేపూరు గ్రామానికి చెందిన నారాయణ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు ఆంజనేయులు గౌడ్, హనుమంతరావు, నాగరాజు, యాదగిరిరావు, భగవంతు రావు, వెంకటయ్య, కేశవులు తదితరులు ఉన్నారు.

‘ఇళ్ల కూల్చివేతలో ఎమ్మెల్యేకు సంబంధం లేదు’



మాట్లాడుతున్న బాల్‌రాం గౌడ్

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయ స్థలంలో నిర్మించుకున్న ఇళ్ల కూల్చివేతలో ఎమ్మెల్యేకు సంబంధంలేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు అక్రమంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేస్తే బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల వల్లే ఇళ్లు కూల్చారని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు కొందరు కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు నిర్వాసితులను రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. పార్టీ ఉనికి కోసం అబద్ధాలకు తెరలేపారని ప్రజలు ఆ పార్టీ నాయకులను నమ్మే స్థితిలో లేరన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు గోరటి శివ, నాయకులు నర్సింహ్మా రెడ్డి, సందీప్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

కల్వకుర్తి రూరల్: రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మట్ట నరేష్ గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని తోటపల్లిలో రేషన్ దుకాణాన్ని నాయకులతో కలిసి సందర్శించారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డీలర్లకు సూచించారు. బియ్యం తూకంలో అవకతవకలు పాల్పడితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, శ్రీను ముదిరాజ్, శ్యాంసుందర్, రవీందర్ రెడ్డి, బాలరాజు గౌడ్, రాజు రెడ్డి, లింగారెడ్డి, నాప శివ, ఆనంద్, సురేష్ గౌడ్, నరేందర్ పాల్గొన్నారు.



బియ్యం తూకాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



మైసమ్మ దేవతను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వ్యాపార దుకాణాలు సందడిగా మారాయి. గద్వాల, వనపర్తి, పెబ్బేర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి పనులు కొనసాగుతుండటంతో గంటపాటు ట్రాఫిక్‌జాం అయ్యింది. భక్తులు ఇబ్బందులు పడ్డారు. మృగశిర కార్తి చివరి వారం కావడంతో 15 వేల భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

వెల్దండ: మండలంలోని కొట్రలో ఆదివారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఆ సంఘం జిల్లా నాయకుడు గుడిగానిపల్లి రాజు అధ్యక్షతనగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పు మల్లేష్, ఉపాధ్యక్షుడిగా బుత్కూరి శేఖర్, మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్‌మాదిగా కార్యదర్శులుగా శివ, శేఖర్, ప్రచార కార్యదర్శిగా పర్వతాలు, గౌరవ అధ్యక్షుడిగా రామస్వామి, మరికొంత మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో మాదిగలు రిజర్వేషన్లను వినియోగించుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు ఎన్నిక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జగన్, చిన్న వెంకటయ్య, రాజేష్, బాలరాజు, శ్రీశైలం, సైదులు తదితరులు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు



కోడేరు/లింగాల: మండలంలోని బవాయిలపల్లిలో ఎస్ఐ జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా లింగాల మండలంలోని అంబట్‌పల్లి మార్గంలో డ్రంకెన్ డ్రైవ్‌లో 5 కేసులు నమోదు అయినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఖయ్యూం, పోలీసులు వేణు, శివకుమార్, ఉన్నారు.

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం



పెద్దకొత్తపల్లి: వచ్చే నెలలో నిర్వహించే వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేసినట్లు ఇన్‌చార్జ్ ఏపీఓ వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో 25 నర్సరీలలో 1.40 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచామన్నారు. నర్సరీలలో నేరేడు, సపోట, జామ, సీతాఫలం తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కావాల్సిన రైతులు ఉపాధి హామీ పథకంలో దరఖాస్తులు చేసుకుంటే మొక్కలను అందజేస్తామని తెలిపారు. గ్రామాల్లో ఖాళీ స్థలాలను గుర్తించి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటునట్లు వివరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురులో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎంపీడీఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శివ భూమి పూజ చేశారు. గ్రామానికి 20 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాంచంద్రారెడ్డి, రామయ్య, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్‌రోకోకు మద్దతు

కల్వకుర్తి రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో జూలై 17న నిర్వహించే రైల్‌రోకోకు తెలంగాణ బీసీ మహాసభ మద్దతు ఇస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లో కవితను ఆయన కలిసి రైల్‌రోకోకు సంఘీభావం తెలుపుతునట్లు వివరించారు. ఆయన వెంట అనిల్, మహేష్, నరేష్ ముదిరాజ్, నరేష్ చారి, శ్రీధర్ ఉన్నారు.

నిధులు కేటాయించండి



అచ్చంపేట రూరల్: వెనకబడిన నల్లమల ప్రాంతానికి అధిక నిధులు కేటాయించాలని టీపీసీసీ ప్రవాసీ విభాగం కన్వీనర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. నల్లమల ప్రాంత సమస్యలను వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని అమరేందర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్‌కు చెందిన 10 వ తరగతి విద్యార్థులు ఆదివారం ఎదిరేపల్లిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 34 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంబురపడ్డారు. అప్పటి గురువులను సన్మానించారు. పూర్వవిద్యార్థులు తదితరులు ఉన్నారు.

వాల్మీకులు ఐక్యత చాటాలి

చిన్నంబావి: వాల్మీకుల సమస్యల పరిష్కారం కోసం వాల్మీకుల ఐక్యతను చాటాలని వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు రామకృష్ణ, రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వాల్మీకి విగ్రహం దగ్గర బీజేపీ మండల అధ్యక్షుడిగా బొగ్గు కురుమయ్య నాయుడు ఎన్నిక కావడంతో ఆయనకు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

మెజార్టీ స్థానాలు సాధించాలి..

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని ఎల్లెని సుధాకర్ రావు అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయ్యేనా?



వెల్దండ మండలం పోతేపల్లిలో అసంపూర్తిగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు 2018 సంవత్సరంలో నూతనంగా 33/11కెవీఏ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.1.20కోట్ల నిధులను కేటాయించింది. దీంతో పోతేపల్లి, లింగారెడ్డిపల్లి, దొడ్లపల్లి, బుడ్డోనిపల్లి, ఎంజీతండా, అల్లంతోటబావితండా, పోషమ్మతండా తదితర గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి కాంట్రాక్టర్లు పనులు దక్కించుకొని పనులను ప్రారంభించారు. కొంత వరకు పనులను పూర్తి చేసి కాంట్రాక్టర్లు అర్థాంతరంగా పనులను నిలిపివేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు, సబ్‌కాంట్రాక్టర్‌కు ఇద్దరి మధ్య బిల్లుల సమస్యలు వచ్చి పనులు మధ్యలో నిలిపివేసినట్లు పలువురు తెలిపారు. దాదాపుగా పనులు నిలిచి ఆరేళ్లు గడుస్తున్న నేటికి పూర్తి కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు, రైతులు అనేక సార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

పట్టించుకోని అధికారులు

సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారుల పట్టించుకొని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లో ఓల్టేజీతో ఇబ్బంది పడుతున్నాం



వర్షాకాలంలో లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. వ్యవసాయ బోరు మోటర్లు తరుచుగా మరమ్మతుకు గురవుతున్నాయి. సాగుచేసిన పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. కేఎల్ఐ కాల్వ ద్వారా సారునీ రువస్తున్న లోవోల్టేజీతో పంటలను కాపాడుకోలేకపోతున్నాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదు. అసంపూర్తిగా ఉన్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పూర్తి చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి.

–కొండల్‌యాదవ్, రైతు, పోతేపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



పోతేపల్లిలో అసంపూర్తిగా ఉన్న సబ్‌స్టేషన్ పనులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరలోనే పనులు పూర్తి చేయిస్తాం. రైతులకు లోవోల్టేజీ సమస్యను ఉన్న మాట వాస్తవమే. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కేఎల్ఐ కాల్వ రావడంతో విద్యుత్ మోటర్ల పెరగడంతో సమస్య తీవ్రంగా ఉంది.

– జానకీరాం నాయక్, ఇన్‌చార్జ్ ఏఈ, వెల్దండ

నిరుపయోగంగా పల్లె దవాఖానా

పెంట్లవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పల్లె దవాఖానాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలంలోని మంచాలకట్టలో రెండ సంవత్సరాల కిందట రూ.10 లక్షల వ్యయంతో పల్లె దవాఖానా నిర్మించారు. 2023వ సంవత్సరం అక్టోబర్ 7న ఆస్పత్రిని ప్రారంభించారు. కాని ఇప్పటివరకు వైద్యులను నియమించకపోవడంతో దవాఖానా వృథాగా దర్శనమిస్తోంది. పల్లె ప్రజలు వైద్య సేవలకు ఇబ్బందులు పడుతున్నారు. ఏదైన అనారోగ్యం బారిన పడితే కొల్లాపూర్ వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు గ్రామస్తులు దవాఖానా ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మంచాలకట్టలో నిరుపయోగంగా ఉన్న పల్లె దవాఖానా